సాక్షి మహబూబ్‌నగర్

గురువారం । 10 । ఏప్రిల్ । 2025



ఏఐతో విప్లవాత్మక మార్పులు

ఏఐ విప్లవాత్మక మార్పులు తీసుకురానుందని టీజీసీహెచ్ఈ చైర్మన్ అన్నారు.

వివరాలు 8లో ▸



'స్లాట్' బుకింగ్ సేవలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం 40.1 /20.7

వాతావరణం

ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. సాయంత్రం జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (మహిళలు- మహబూబ్‌నగర్), (పురుషులు–నాగర్‌కర్నూల్)లలో విద్యార్థులకు బోధించడానికి అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని టీడబ్ల్యూ గురుకులం మహబూబ్‌నగర్ రీజియన్ కో–ఆర్డినేటర్ పీఎస్ కల్యాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కెమిస్ట్రీలో నాలుగు, ఫిజిక్స్‌లో రెండు, హిస్టరీ, కామర్స్, తెలుగు, ఇంగ్లిష్, కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్, లైబ్రేరియన్ ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించి ఉండాలని, అలాగే ఆయా సబ్జెక్టులలో సెట్, నెట్, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 16వ తేదీలోగా మహబూబ్‌నగర్ శివారు తిరుమల హిల్స్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ (మహిళలు) ప్రిన్సిపాల్‌కు పూర్తి చేసిన దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఈనెల 17వ తేదీ ఉదయం పది గంటలకు ఇదే కళాశాలలో నిర్వహించే డెమోకు తప్పక హాజరు కావాల్సి ఉంటుందని, పూర్తి వివరాలకు సెల్ నం.7901097704, 9848616564లను సంప్రదించ వచ్చని పేర్కొన్నారు.

ఈద్గానిపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



మహబూబ్‌నగర్ క్రైం: సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రతి గ్రామం ఈద్గానిపల్లిని ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ డి.జానకి అన్నారు. రాజాపూర్ మండలం ఈద్గానిపల్లిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు బుధవారం ఎస్పీ కార్యాలయంలో రూ.4 లక్షల చెక్కును ఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల భద్రతను పెంపొందించుకోవడానికి, గ్రామంలో శాంతి భద్రతలను మెరుగుపరుచుకోవడానికి, దొంగతనాలు, అసాంఘీక కార్యకలాపాలను అరికట్టడానికి గ్రామస్తులు ముందుకు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, రాజాపూర్ ఎస్ఐ శివానందం గౌడ్, గ్రామ పెద్దలు పంభాక్షరి, నరేందర్‌రెడ్డి, బాలగౌడ్, శ్రీనివాసులు, జగన్‌మోహన్‌రెడ్డి, రఘువీరారెడ్డి, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

బెట్టింగ్‌పై కఠినంగా వ్యవహరిస్తాం

జిల్లాలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్ ఆడినా, వాటిని ప్రోత్సాహించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ డి.జానకి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఈజీమనీ కోసం యువత అలవాటుపడి అధికంగా క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నారని, దీనివల్ల బంగారు భవిష్యత్ అంధకారంగా మారుతుందని పేర్కొన్నారు. బెట్టింగ్ భూతాన్ని కట్టడి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రధానంగా తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై నిఘా పెట్టాలని సూచించారు. బెట్టింగ్ ఆడుతున్నట్లు తెలిస్తే 8712659360 నంబర్‌కు, డయల్ 100కు ఫిర్యాదు చేయాలన్నారు.

బడ్జెట్‌లో క్రీడల అభివృద్ధికి రూ.465 కోట్లు



మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.465 కోట్లు కేటాయించినట్లు రాష్ట్ర ప్రభుత్వ క్రీడల వ్యవహారాల సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని జితేందర్‌రెడ్డి నివాసంలో బుధవారం లాక్రోస్ క్రీడాకారులు, రాష్ట్ర సంఘం ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో క్రీడలకు కేటాయించిన నిధులతో రాష్ట్రంలో మరుగున పడిన క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తామన్నారు. యువత మాదక ద్రవ్యాల వైపు మరలకుండా ఏదో ఓ క్రీడలో పాలుపంచుకోవాలని సూచించారు. లాక్రోస్ క్రీడను రాష్ట్రంలో అభివృద్ధి పరిచి గుర్తింపు తీసుకొస్తామని తెలిపారు. లాక్రోస్ క్రీడ అభివృద్ధి చెందిన అమెరికా, కెనడా లాంటి దేశాల్లో ముఖ్య క్రీడగా ఉందని, ఇండియాలో ఇప్పుడిప్పుడే ప్రాచుర్యంలోకి వస్తుందని లాక్రోస్ ఇండియా టీమ్ కెప్టెన్ అనుదీప్‌రెడ్డి తెలిపారు. త్వరలో ఆగ్రాలో లాక్రోస్ క్రీడ నేషనల్స్ నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ లాక్రోస్ అకాడమీ అధ్యక్షుడు భానుచందర్, ప్రధాన కార్యదర్శి శేఖర్, కోచ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వికాసానికి విఘ్నాలు!

'రాజీవ్ యువ వికాసం' దరఖాస్తులకు అడ్డంకులు



ఈ ఫొటోలో కనిపిస్తున్న యువకుడు నారాయణపేట జిల్లా నర్వ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రవి. ఇతను రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం వారం రోజులుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. చాలామంది ఒకే సారి దరఖాస్తు చేసుకోవడంతో కాస్త ఆలస్యం అవుతుందని అధికారులు చెబుతుండడంతో నిరాశతో వెనుదిరుగుతున్నాడు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో కాకుండా మండల పరిషత్ కార్యాలయంలో అందించేందుకు చర్యలు తీసుకోవాలని రవి కోరుతున్నాడు.

- అనేక ప్రాంతాల్లో సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు
- ఆన్‌లైన్‌లో మండలం, బ్యాంక్, గ్రామాల పేర్లు గల్లంతు
- రేషన్‌కార్డులో ఒక్కరికే అవకాశం.. కొత్తవి రాక పలువురి ఆందోళన
- కొన్ని చోట్ల కులం, ఆదాయం సర్టిఫికెట్లకూ తప్పని పాట్లు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి సాంకేతిక సమస్యలు అడ్డంకిగా మారాయి. ఈ పథకంలో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల యువతకు సబ్సిడీ రుణాలు అందించేందుకు ఈ ఏడాది మార్చి 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టగా.. ఈ ప్రక్రియకు అడుగడుగునా ఆటంకాలు ఎదురైన విషయం తెలిసిందే. దీంతో సర్కారు దరఖాస్తుల తుది గడువును మార్చి 30 నుంచి ఈ నెల 14 వరకు పొడిగించింది. అయినప్పటికీ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు రకాల సాంకేతిక సమస్యలు వేధిస్తూనే ఉన్నాయి. సర్కారు నిర్దేశిత గడువుకు మరో నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉండగా.. దరఖాస్తుదారుల్లో ఆందోళన గూడు కట్టుకుంది. మీ సేవ, ఇంటర్నెట్ సెంటర్ల వద్దకు నిత్యం చక్కర్లు కొడుతున్నా.. ఫలితం లేకపోవడంతో వారిలో అసహనం వ్యక్తమవుతోంది.

సాక్షి ఫోకస్

సమస్యలు.. ఇబ్బందులు

■ జిల్లాల పునర్విభజనలో రంగారెడ్డి జిల్లాలోని గండేడ్ మండలాన్ని మహబూబ్‌నగర్ జిల్లాలో చేర్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాత గండేడ్ మండలం నుంచి కొత్తగా మహమ్మదాబాద్ మండలం ఏర్పాటైంది. ఈ క్రమంలో ఆయా మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారికి.. ఆ గ్రామ పరిధిలోని బ్యాంకులు వెబ్‌సైట్‌లో కనిపించడం లేదు. ఆయా గ్రామాల పరిధిలోని బ్యాంకులను ఎంపిక చేసుకున్న పక్షంలో వారికి సంబంధం లేని గ్రామాల పేర్లు చూపిస్తోంది. ఈ సమస్య మహమ్మదాబాద్‌తో పాటు ఉమ్మడి జిల్లాలో నూతనంగా ఏర్పాటైన కొకుంట్ల, మూసాపేట, కొత్తపల్లి, గుండుమాల్, ఎర్రవల్లి, పదర, చిన్నంబావి మండల పరిధిలో నెలకొన్నట్లు తెలుస్తోంది.

■ మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని ధర్మాపూర్, చౌదర్‌పల్లి గ్రామాలకు సంబంధించిన పేర్లు ఒకసారి వెబ్‌సైట్‌లో కనపడుతున్నాయి. మరి కొన్ని సార్లు చూపించడం లేదు. దీంతో ప్రతిరోజు మీసేవ, ఇంటర్నెట్ సెంటర్లకు క్యూ కట్టాల్సి వస్తోందని పలువురు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

■ గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ రుణాలకు పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చిన విషయం తెలిసిందే. ఈ దరఖాస్తుదారులకు సంబంధించి యువ వికాసం పథకంలో తొలుత అడ్డంకులు వచ్చాయి. వెబ్‌సైట్ దరఖాస్తులు స్వీకరించలేదు. ఈ క్రమంలో ఆ దరఖాస్తులను పక్కన బెట్టడమే కాకుండా.. వెబ్‌సైట్‌లో వాటిని ఎత్తేసినట్లు సమాచారం. ప్రస్తుతం వారికి ఇబ్బంది లేకున్నా.. గతంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. వెబ్‌సైట్ దరఖాస్తులు స్వీకరించకపోవడమే ఇందుకు కారణం.

■ రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోవాలంటే ఆధార్, పాన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతో పాటు ఆదాయ ధ్రువీకరణ పత్రం కావాలి. అయితే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆదాయం సర్టిఫికెట్ 2024 ఏప్రిల్ తర్వాత తీసినదై ఉండాల్సి రావడంతో ఎక్కువ మంది మీ సేవ సెంటర్లు, రెవెన్యూ కార్యాలయానికి చక్కర్లు కొడుతున్నారు. ఐదారు మండలాల్లో మినహా మిగిలిన మండలాల్లో ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో ఇబ్బందులు లేవు. కుల ధ్రువీకరణలో మాత్రం జాప్యం జరుగుతోంది.

తప్పని పరేషాన్..

కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వేలాది మంది కొన్నేళ్లుగా నిరీక్షిస్తూనే ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తవి ఇస్తామని ప్రకటించింది. ఆ ప్రక్రియ కొనసాగుతోంది. నిబంధనల ప్రకారం రేషన్‌కార్డులో ఉన్న పేర్లలో ఒకరికి మాత్రమే రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలి. ఈ క్రమంలో రేషన్‌కార్డులకు కొత్తగా దరఖాస్తు చేసుకుని వేచి చూస్తున్న వారు యువ వికాసంలో తమకూ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. అదేవిధంగా అర్హులై ఉండి రేషన్ కార్డు రానివారిలో అసంతృప్తి నెలకొన్నట్లు తెలుస్తోంది.

రేషన్ కార్డు లేకపోవడంతో..



రాజీవ్ యువవికాస్ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు వెళితే రేషన్‌కార్డు అడిగారు. మాకు రేషన్‌కార్డు రాకపోవడంతో దరఖాస్తు చేసుకోలేకపోయాను. ఇప్పటి వరకు ఎలాంటి ప్రభుత్వ పథకం తీసుకోలేదు. కొత్త ప్రభుత్వంలోనైన రేషన్‌కార్డు వస్తుందనుకుంటే కొందరికి ఇచ్చి కొందరికి ఇవ్వడంలేదు.

– రాజు, గద్వాల పట్టణం

మా గ్రామానికి సంబంధం లేని బ్యాంక్ చూపిస్తోంది..

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు వారం రోజులుగా ప్రయత్నిస్తున్నా. మండల కేంద్రంలో కావడం లేదని మహబూబ్‌నగర్‌కు రెండుసార్లు వచ్చాను.వెబ్‌సైట్‌లో గ్రామం పేరు ఎంపిక చేసుకుంటే.. ఎస్‌బీఐ ఐఎఫ్ఎస్‌సీ కోడ్ చూపించడం లేదు. హెచ్‌డీఎఫ్‌సీ చూపిస్తోంది. నాకు అందులో ఖాతా లేదు. ఇలా కాదని ఎస్‌బీఐ ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎంపిక చేసుకుంటే కంచంపల్లి గ్రామం పేరు చూపిండం లేదు. పలుమార్లు ప్రయత్నించినా ఫలితం లేదు. నా సమస్యను పరిష్కరించాలి. – రమేష్, కంచంపల్లి, మహమ్మదాబాద్

టెక్నికల్ సమస్యలను పరిష్కరిస్తాం

యువ వికాసం పథకం దరఖాస్తులకు సంబంధించి పలు టెక్నికల్ సమస్యలు మా దృష్టికి వచ్చాయి. కొన్నింటిని పరిష్కరించాం. కొత్త మండలాల్లో బ్యాంకులు, గ్రామాలు తదితర సమస్యలు వస్తున్నట్లు తెలుస్తోంది. బీసీ లోన్ కింద దరఖాస్తు చేసుకునే వారు మహబూబ్‌నగర్‌లోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయానికి వస్తే వెంటనే పరిష్కరిస్తాం. ఎవరూ ఇబ్బందిపడాల్సిన అవసరం లేదు. కార్యాలయంలో ఎడిట్ ఆప్షన్‌కు అవకాశం ఉంది. – ఇందిర, బీసీ సంక్షేమ శాఖ అధికారి, మహబూబ్‌నగర్

ఇంటర్వ్యూలకు త్వరలో షెడ్యూల్..

దరఖాస్తుల గడువు ముగిసిన తర్వాత లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి మండల, జిల్లాస్థాయిలో ఇంటర్వ్యూ నిర్వహణకు అధికారులు షెడ్యూల్ ప్రకటించనున్నట్లు సమాచారం. ఆ తర్వాత దరఖాస్తులు చేసుకున్న వారి వ్యాపార పెట్టుబడి ఆధారంగా ఆయా బ్యాంకులు సబ్సిడీ రుణాలు అందజేయనున్నాయి. రూ.50 వేలు తీసుకుంటే 100 శాతం సబ్సిడీ రానుంది. రూ.లక్షకు 90 శాతం, రూ.2 లక్షలకు 80 శాతం.. ఆ తర్వాత రూ.4 లక్షల వరకు 70 శాతం సబ్సిడీ వర్తించనుంది. జూన్ రెండో తేదీ వరకు ప్రక్రియ పూర్తి చేసి.. రుణం మొత్తాన్ని లబ్ధిదారులకు అందించేలా ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు సమాచారం.



దామరగిద్దలోని మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటున్న యువకులు

ఉమ్మడి జిల్లాలో కార్పొరేషన్ల వారీగా దరఖాస్తులు ఇలా (ఇప్పటివరకు)..

జిల్లా	బీసీ	ఎస్సీ	ఎస్టీ	మైనార్టీ
మహబూబ్‌నగర్	14,888	4,790	3,519	3,380
వనపర్తి	10,546	3,882	1,547	1,385
నారాయణపేట	9,294	3,483	1,037	1,666
నాగర్‌కర్నూల్	13,577	7,300	4,300	1,450
జోగులాంబ గద్వాల	9,332	6,063	334	1,504

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పించాలి



మినుగోనిపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

దేవరకద్ర: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం యూనిట్ కాస్ట్‌లో నిర్మించుకునే విధంగా లబ్ధిదారులకు అవగాహన కలిగించాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. బుధవారం దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని మినుగోనిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. గ్రామంలో ఐదు ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ వరకు పూర్తికాగా, 14 ఇళ్ల మార్కింగ్ వేసినట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా బేస్‌మెంట్ పూర్తయిన లబ్ధిదారురాలు మాసమ్మ ఇంటి వద్దకు కలెక్టర్ వెళ్లి పనులను పరిశీలించారు. బేస్‌మెంట్ కట్టడానికి ఎంతయిందని ఆమె ప్రశ్నించగా రూ.95 వేలు ఖర్చు అయినట్లు మాసమ్మ తెలిపింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ డిజైన్ ప్రకారం యూనిట్ కాస్ట్‌లో తక్కువ ఖర్చుతో ఇంటిని అందంగా కట్టుకోవచ్చని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచిత ఇసుక సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తహసీల్దార్‌ను ఆదేశించారు. గ్రామంలోని అంగన్‌వాడీ, ఆశావర్కర్లవి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ అడిగారు. కలెక్టర్ పర్యటిస్తున్న సమయంలో అక్కడి నుంచి వస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. ఆమె వెంట గృహ నిర్మాణ పీడీ వైద్యం భాస్కర్, ఎల్‌డీఎం భాస్కర్, డీఆర్‌డీఓ నర్సింహులు, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాహారం తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర సూచించారు. బుధవారం తన చాంబర్‌లో పోషణ పక్షం వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ పక్షంలో భాగంగా ఈ నెల 22 వరకు పోషణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పోషకాహార లోపం అధిగమించడానికి గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ లబ్ధిదారులతో పాటు వారి కుటుంబసభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు, మహిళ శిశు సంక్షేమాధికారి జరీనాబేగం, డీఎంహెచ్ఓ కృష్ణ, అదనపు డీఆర్‌డీఓ జోజప్ప తదితరులు పాల్గొన్నారు.

టూరిజం స్పాట్‌గా వానగట్టు

- వ్యూ పాయింట్ కోసం స్థల పరిశీలన
- 3 శాఖల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: త్వరలో స్థానిక నవాబుపేట రోడ్డులోని వానగట్టు టూరిజం స్పాట్‌గా మారనుంది. ఇక్కడ అందుబాటులో ఉన్న సుమారు ఆరు ఎకరాల విస్తీర్ణంలో పర్యాటక, అటవీ, మున్సిపల్ కార్పొరేషన్ శాఖల ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రం శివారులో పిల్లలమర్రి, మయూరి పార్కు, మినీ ట్యాంక్‌బండ్, శిల్పారామం తదితర ప్రాంతాలు టూరిజం స్పాట్‌గా కొనసాగుతున్నాయి. తాజాగా వానగట్టు సైతం చేరింది. ఇది ఎత్తయిన ప్రదేశం కావడంతో నగరం మొత్తం ఇక్కడి నుంచి చూసే అవకాశం ఉంటుంది. ఆహ్లాదకరంగా ఉండేందుకు విరివిగా మొక్కల పెంపకం చేపట్టనున్నారు. ఇందులో భాగంగా అక్కడ వ్యూ పాయింట్ ఏర్పాటుకు బుధవారం స్థల పరిశీలన చేశారు. కాగా, ఇప్పటికే అప్పన్నపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌కు సంబంధించి మయూరి నర్సరీ ఆవరణలో వ్యూ పాయింట్ ఉంది. కార్యక్రమంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఎఫ్ఓ సత్యనారాయణ, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



వానగట్టుపై స్థలాన్ని పరిశీలిస్తున్న స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ తదితరులు

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి



బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పదేళ్ల బీఆర్ఎస్ హయాంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని బీఆర్ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్న సమయంలో కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజల సమస్యలపైన బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. పార్టీ ఏర్పడి 25ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈనెల 27న వరంగల్‌లోజరిగే రజతోత్సవ సభ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్‌రాజేశ్వర్‌గౌడ్, నాయకులు నర్సిములు, వెంకటన్న, ఆంజనేయులు, గణేష్, దేవేందర్‌రెడ్డి, శివరాజు, సాయిలు, శ్రీనివాస్‌రెడ్డి, నవకాంత్, శ్రీకాంత్‌రెడ్డి, శరత్, వర్ధభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాల బ్యాంక్

నేడు జనరల్ ఆస్పత్రిలో ధాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్ ప్రారంభం

- ఎస్ఎన్‌సీయూలో చికిత్స పొందే నవజాత శిశువులకు ఉపయోగకరం
- అత్యాధునిక పద్ధతిలో ఉత్పత్తి
- దాతల ద్వారా తల్లిపాల సేకరణ



ఆర్ఓ ప్లాంట్



ధాత్రి మిల్క్ బ్యాంకు సెంటర్



ఏర్పాటు చేసిన యంత్రాలు

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలోని ఎంసీహెచ్ భవనంలో గురువారం సుషేనా హెల్త్ ఫౌండేషన్-జనరల్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ధాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్- కంప్రహెన్సివ్ లాక్టేషన్ మేనేజ్‌మెంట్ సెంటర్ ప్రారంభం చేయనున్నారు. తల్లి పాలు నిల్వ చేయడంతో పాటు లాక్టేషన్ సపోర్ట్ సర్వీస్, బరువు తక్కువగా చిన్నారులకు, నెలలు నిండకముందే ప్రసవం అయిన చిన్నారులకు, తల్లిపాలు లేని చిన్నారుల కోసం తల్లి పాలను సేకరించి.. అవసరమైనన వారికి అందించడమే ఈ బ్యాంకు ముఖ్య ఉద్దేశం. ప్రసవం తర్వాత పాలు ఉత్పత్తి కాని తల్లులకు సైతం బ్రెస్ట్ పంప్ వంటి ప్రత్యేక పద్ధతి ద్వారా వారి నుంచి పాలు ఉత్పత్తి అయ్యే విధంగా చర్యలు చేపడతారు. అలాంటి తల్లులు మొదట వారి పిల్లలకు పాలు ఇచ్చిన తర్వాత మిగిలిన పాలను బ్యాంకులో వితరణ చేయాల్సి ఉంటుంది. అలాగే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పాలు వితరణ చేసిన తల్లుల పాలను సేకరించి అన్ని రకాల పరీక్షలు పూర్తి చేసి చిన్నారులకు అందిస్తారు.

■ ఉమ్మడి జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న జనరల్ ఆస్పత్రిలో ప్రతి రోజు 30 నుంచి 35 ప్రసవాలు అవుతాయి. ఇందులో ముగ్గురి నుంచి నలుగురు శిశువులకు ఆరోగ్య సమస్యలతో పాటు తల్లిపాలు సక్రమంగా ఉత్పత్తి కాకపోవడం వల్ల ఇబ్బంది పడుతుంటారు. ఈక్రమంలో ఇలాంటి నవజాత శిశువులను ఎస్ఎన్‌సీయూలో అడ్మిట్ చేసి చిన్న పిల్లల వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తుంటారు. ప్రతి నెల జనరల్ ఆస్పత్రిలో ఎస్ఎన్‌సీయూలో 350 చిన్నారులు చేరుతుంటే.. ఇందులో బయటి ఆస్పత్రుల నుంచి రెఫర్ మీద దాదాపు వంద కేసులు వస్తుంటాయి. వీరందరికీ తల్లి పాలు ఉండవు. ఈ క్రమంలో ఇలాంటి శిశువులు అందరికీ తల్లి పాల బ్యాంకు వల్ల మేలు జరగనుంది.

■ పాల బ్యాంకు ద్వారా పెస్టరైజ్ చేసిన డోనర్ బ్రెస్ట్ మిల్క్‌ను అందించడం జరుగుతుంది. సేకరించిన పాలలో 10ఎంఎల్ కల్చర్ పరీక్షలు పూర్తి చేసిన తర్వాత వచ్చిన రిపోర్ట్ ఆధారంగా పెస్టరైజ్ డోనర్ హ్యూమన్ మిల్క్‌ను జిల్లా జనరల్ ఆస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూలో చికిత్స పొందుతున్న నవజాత శిశువులకు వైద్యుల సలహా, సూచన మేరకు ఉచితంగా అందిస్తారు. సాధారణంగా పౌడర్, డబ్బా పాలు, గేదె, ఆవు పాలు తాగించడం వల్ల నవజాత శిశువుల జీర్ణక్రియ అరిగించే సామర్థ్యం చాలా తక్కువగా ఉండటం వల్ల కొత్త రకం ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఈ పద్ధతి ద్వారా సేకరించిన తల్లి పాలు దాదాపు ఏడాది పాటు నిల్వ చేసుకునే అవకాశం ఉంది.

■ జిల్లా జనరల్ ఆస్పత్రిలోని ఎంసీహెచ్ భవనంలో ధాత్రి మదర్ మిల్క్ బ్యాంకులో అత్యంత ఖరీదైన పరికరాలు ఏర్పాటు చేశారు. పెస్టరైజ్ ఫ్రీజర్లు, -20 డిగ్రీ ఫ్రిజ్‌లు, బ్రెస్ట్ పంప్‌లు మూడు, ప్రత్యేక ఆర్ఓ ప్లాంట్, ప్రత్యేక మిషనరీ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో నిలోఫర్ ఆస్పత్రి తర్వాత అత్యంత పెద్ద తల్లిపాల బ్యాంకుగా పాలమూరు జనరల్ ఆస్పత్రి నిలిచిపోనుంది. ప్రీటర్మ్, బరువు తక్కువగా ఉన్న పిల్లలు సాధారణ పాలు మింగలేరు. దీంతో డోనర్ పాల ద్వారా వారికి ముఖ్యమైన పోషకాలు, యాంటీబాడీస్, వృద్ధికారకాలను అందించడానికి ఉపయోగపడుతుంది.

అన్ని పరీక్షలు పూర్తి చేసిన తర్వాతే..



ప్రతి బిడ్డకు తల్లి పాలు అందించాలనే లక్ష్యంతో ఈ తల్లి పాల బ్యాంకు ఏర్పాటు చేస్తున్నాం. దీని ద్వారా ఎంతో మంది తల్లిలేని పిల్లలు, పాలు సక్రమంగా ఉత్పత్తి కానీ తల్లులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో పాలు ఉత్పత్తి కానీ తల్లులు ధాత్రి పాల బ్యాంకు ఉపయోగించుకోవాలి. పాలు ఉత్పత్తి చేసే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకోవడం పాటు సేకరించిన పాలకు అన్ని పరీక్షలు పూర్తి చేసిన తర్వాత చిన్నారులకు అందిస్తాం. – రమేష్ లక్కర్స్, పాల బ్యాంకు ప్రోగ్రామ్ అధికారి

నవజాత శిశువులకు మేలు..



చాలా మంది బాలింతలు, తల్లులకు హార్మోన్లతో పాటు అనారోగ్య సమస్యల వల్ల పాలు ఉత్పత్తి జరగవు. అలాగే నెలల నిండకముందే ప్రసవం అయిన తల్లులకు సైతం పాలు సకాలంలో రావు. ఇలాంటి వారి కోసం పాల బ్యాంకు నుంచి తల్లిపాలు సేకరించి అందిస్తాం. ఇది నవజాత చిన్నారులకు ఎంతో ఉపయోకరంగా ఉంటుంది. ప్రతి శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఆస్పత్రిలో నేడు ప్రారంభం చేయడానికి కలెక్టర్ విజయేందిర, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారు. – డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

ఏఐతో విప్లవాత్మక మార్పులు



సెమినార్‌లో ప్రసంగిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

- ప్రపంచంలో భారతదేశం కీలకం కాబోతుంది..
- ఒక్క సముద్ర రంగంలోనే 20లక్షల ఉద్యోగాలు
- కళాశాల సిలబస్‌లోనూ మార్పులు తెచ్చేందుకు వీసీలతో చర్చలు
- జాతీయ సెమినార్‌లో ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి



సెమినార్‌కు హాజరైన ప్రతినిధులు

జడ్చర్ల టౌన్: ఆర్టిఫిషియల్ టెక్నాలజీ విప్లవాత్మక మార్పులు తీసుకురానుందని తెలంగాణ ఉన్నత విద్యామండలి (టీజీసీహెచ్ఈ) చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. జడ్చర్ల పట్టణంలోని డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉన్నత విద్యామండలి సహకారంతో 'వాణిజ్యం నిర్వహణలో ఏఐ పాత్ర' అంశంపై నిర్వహించిన జాతీయ సెమినార్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. సాంకేతికత ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ 21వ శతాబ్దంలో అధిక ప్రభావం చూపుతోందని.. భవిష్యత్‌ను



కృత్రిమ మేధస్సుపై వేసిన రంగవల్లి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏలబోతుందని అన్నారు. 18వ శతాబ్దంలో వచ్చిన పారిశ్రామిక విప్లవంతో అభివృద్ధి చెందగా.. 21వ శతాబ్దంలో సాంకేతిక విప్లవంతో భారతదేశం ప్రపంచంలో కీలక పాత్ర పోషించనుందన్నారు. పెరిగిన సాంకేతికత కారణంగా 2030 నాటికి దేశంలో ఒక సముద్ర రంగంలోనే 20లక్షల ఉద్యోగాలు రానున్నాయన్నారు. భవిష్యత్‌లో ఉద్యోగాల కొరత ఉండదన్నారు. అందుకు అనుగుణంగా 2025–26 విద్యాసంవత్సరంలో కళాశాల సిలబస్‌లోనూ పూర్తి మార్పులు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లతో చర్చిస్తున్నామన్నారు. విద్యార్థులు ఫేస్‌బుక్‌ను వీడి.. టెక్స్ట్‌బుక్‌లను చదవాలని సూచించారు. ప్రపంచంతో పోటీపడే మనస్తత్వం కలిగి ఉండాలని, ఇందుకు మల్టీ డిసిప్లేనరి అవసరమన్నారు. విద్యారంగంలో అనేక మార్పులు వస్తున్నందున క్షేత్రస్థాయిలో అధ్యాపకులు సైతం మారాలన్నారు. స్కిల్ బేస్డ్ కోర్సులకు ప్రాధాన్యత ఇస్తున్నామని.. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెమినార్‌లో ఆన్‌లైన్ ద్వారా 130 జనరల్స్, నేరుగా 30 మంది పాల్గొని ఏఐపై విపులంగా వివరించారు. అనంతరం ఆన్‌లైన్‌లో అందిన అబ్‌స్ట్రాక్ట్‌లతో కూడిన సావనీర్‌ను టీజీసీహెచ్ఈ చైర్మన్ ఆవిష్కరించారు. కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన సెమినార్‌లో ప్రిన్సిపాల్ డా.సుకన్య, కన్వీనర్ నాగలక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసులు, కోకన్వీనర్ సులేమాన్, సభ్యులు శంకర్, వెంకట్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సృష్టించాలి..



విద్యార్థులు ఉద్యోగం కోసం చదవకుండా సాంకేతికతను ఉపయోగించుకుని ఉద్యోగాలను సృష్టించేందుకు సిద్ధం కావాలి. అందుకోసం ఆర్టిఫిషియల్ టెక్నాలజీని అవకాశంగా మార్చుకోవాలి. సమాజానికి ఉపయోగపడేలా సైన్స్, కామర్స్, ఇంజినీరింగ్‌తో పాటు అన్ని కోర్సుల సిలబస్‌లో మార్పులు తీసుకువస్తున్నాం. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు గ్రామీణ ప్రాంత, మధ్యతరగతికి చెందిన వారే అధికం. వారందరికీ సాంకేతికతను అందించేందుకు కృషిచేస్తున్నాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భవిష్యత్‌లో అనేక మార్పులు తీసుకురానుంది. ఆ దిశగా మనం మారాలి. ఇలాంటి సదస్సుల్లో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు తమ అభిప్రాయాలు పంచుకుని సాంకేతికంగా ముందుకెళ్లాలి. సెమినార్‌లలో జ్ఞానం పంచుకోవటం అందరికీ ఉపయోగకరం. – జీఎన్ శ్రీనివాస్, వైస్ చాన్స్‌లర్, పాలమూరు యూనివర్సిటీ

కృత్రిమ మేధా పనితనం ప్రశంసనీయం..



వాణిజ్య నిర్వహణలో కృత్రిమ మేధా పనితనం ప్రశంసనీయం. కృత్రిమ మేధ నుంచి మెరుగైన ఫలితాలు రాబట్టడానికి సంఖ్యాకశాస్త్రం, సంభావ్యత శాస్త్రం విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉంది. ఇదంతా ఒకవైపు అయితే.. మరోవైపు కృత్రిమ మేధ నుంచి అనేక దుష్పరిణామాలు సైతం ఎదుర్కొబోతున్నాం. వాటిపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉంది. పెరిగిన సాంకేతికత అభివృద్ధికి సోపానం కావాలి. – యలమంచిలి రామకృష్ణ, ఐపీఈ కళాశాల ప్రొఫెసర్

అన్ని రంగాల్లోనూ అభివృద్ధి..



కృత్రిమ మేధతో భవిష్యత్‌లో అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సులభతరం అవుతుంది. ముఖ్యంగా ఈ కామర్స్ రంగం, యూట్యూబ్ లాంటి సామాజిక మాధ్యమాల వేదికల్లో కృత్రిమ మేధ పనితీరు ఊహించని విధంగా మారుతుంది. రానున్న కాలంలో ఎక్సెల్ షీట్ల నిర్వహణ కృత్రిమ మేధ ప్రోగ్రాం పవర్ బీఐ ద్వారా సులభతరం కానుంది. ఫైనాన్స్ మోసాలను అరికట్టడం, భాషా తప్పిదాలను నిరోధించడం, సైబర్ సెక్యూరిటీలో కృత్రిమ మేధ ద్వారా మెరుగైన పనితీరు రాబట్టుకోవడానికి ప్రాంప్ట్ ఇంజినీరింగ్ నైపుణ్యాలను విద్యార్థులు అలవర్చుకోవాలి. – కె.రాజ్‌కుమార్, రిసోర్స్‌పర్సన్, పీయూ ప్రొఫెసర్

బ్యాంకింగ్ రంగంపై ప్రభావం..



బ్యాంకింగ్ రంగంలోనూ కృత్రిమ మేధ ప్రభావం చూపనుంది. రోజు జరిగే అన్ని వ్యవహారాలపై రిజర్వు బ్యాంక్ ప్రత్యక్ష నియంత్రణ కలిగి ఉంటుంది. ప్రజల డిపాజిట్లు కాపాడి.. వారికి మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి స్థాయిలో నియంత్రణ అవసరం అవుతుంది. ఈ నియమాలు కచ్చితంగా అమలు చేయడం కోసం బ్యాంకులు ఆటోమేషన్ సాంకేతికతను వినియోగిస్తున్నాయి. దాన్ని రెగ్ టెక్ అని పిలుస్తాం. రెగ్ టెక్ పనితీరు మరింత మెరుగుపర్చడానికి కృత్రిమ మేధను బ్యాంకింగ్ రంగం వినియోగిస్తుంది. – సురేష్, అధ్యాపకుడు, ఇబ్రహీంపట్నం ప్రభుత్వ కళాశాల

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్



మహబూబ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

నూతన విధానానికి శ్రీకారం

- రోజుకు 48 మాత్రమే
- ప్రజలకు మరింత సులువుగా, వేగవంతంగా
- 10–15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి
- పైలట్ ప్రాజెక్ట్‌గా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు ఎంపిక
- నేటి నుంచి ప్రారంభం

మెట్టుగడ్డ: రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఉమ్మడి జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా అందులో పైలట్ ప్రాజెక్ట్ కింద మొదటగా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, కార్యాలయాల్లో మాత్రమే ఈ సేవలు ప్రారంభం కానున్నాయి.

గంటల తరబడి నిరీక్షణకు ముగింపు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రజలు గంటల తరబడి వేచి యుండే పరిస్థితి ఉండేది. ముఖ్యంగా కొన్ని కార్యాలయాల్లో ఉదయం వస్తే సాయంత్రంకు కూడా డాక్యుమెంట్ ప్రక్రియ కొనసాగుతుండేది. ఇందులో భాగంగానే దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత సులువుగా, వేగంగా పూర్తయ్యేందుకు ఈ స్లాట్ బుకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకవస్తుంది. ఈ స్లాట్ బుకింగ్ ప్రక్రియలో ఒక్క దస్తావేజు రిజిస్ట్రేషన్‌కు 10నుంచి 15 నిమిషాలలో పూర్తయ్యేలా ఈ కొత్త విధానంలో తేనున్నారు. కొన్ని కార్యాలయాల్లో 80 నుండి 100 దస్తావేజులు వచ్చేవి. దీనితో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మందకొడిగా సాగి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కొందరు దళారులను ఆశ్రయించి డబ్బులు ఇచ్చి పనులు చేయించుకునేవారు. వీటన్నింటికీ చెక్ పెడుతూ ప్రతి కార్యాలయంలో పని వేళల్లో 48 స్లాట్స్‌గా విభజించారు. రోజుకు కేవలం 48 దస్తావేజులు మాత్రమే రిజిస్ట్రేషన్ జరిగేలా అందుబాటులోకి తేనున్నారు.

ప్రజలే దస్తావేజులను తయారు చేసుకునేలా మాడ్యుల్

రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రజలు మధ్యవర్తులపై, దస్తావేజు లేఖరులపై, ఆధారపడకుండా సొంతంగా దస్తావేజులను తయారు చేసుకోవడానికి వెబ్ సైట్ లో ఒక మాడ్యుల్‌ను అందుబాటులోకి తెచ్చారు. కేవలం సేల్‌డీడ్ దస్తావేజులు మాత్రమే చేసుకునేలా అవకాశం కల్పించారు.

స్లాట్ బుకింగ్‌తో ప్రజలకు మేలు



రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన స్లాట్ బుకింగ్ సేవలతో ప్రజలకు మేలు జరుగుతుంది. దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత సులువుగా, వేగంగా కానుంది. ప్రజలు మధ్యవర్తులు, దస్తావేజు లేఖరులపై ఆధారపడకుండా స్వంతంగా దస్తావేజులు తయారు చేసుకునేలా మాడ్యుల్ కూడా అందుబాటులోకి వచ్చింది..

– మొహమ్మద్ హమీద్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్–1, మహబూబ్‌నగర్



మహబూబ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫ్లెక్సీ ఏర్పాటు

స్లాట్ బుకింగ్ విధానం ఇలా

రిజిస్ట్రేషన్ల శాఖ అధికారిక వెబ్ సైట్ registration.telangana.gov.in లోని పబ్లిక్ డేటా ఎంట్రీ ద్వారా తమకు అనుకూలమైన తేదీ, సమయానికి స్లాట్ బుక్ చేసుకొని, ఆ రోజు నిర్దేశించిన సమయానికి నేరుగా విచ్చేసి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకునే వెసులుబాటు కల్పించారు. స్లాట్ బుక్ చేసుకొని వారి కోసం ఏదైనా అత్యవసర సమయాల్లో ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు, ఐదు వాక్ ఇన్ రిజిస్ట్రేషన్లు జరిపేలా, నేరుగా కార్యాలయానికి వచ్చిన వారికి ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో దస్తావేజులు స్వీకరించేలా మరో నూతన పద్ధతికి శ్రీకారం చుట్టారు.

క్లుప్తంగా

ఖైదీలు క్రమశిక్షణతో ఉండాలి



పాలమూరు: వివిధ కేసుల్లో జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని, తమ కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని క్రమశిక్షణతో ఉండాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర అన్నారు. జిల్లాకేంద్రంలోని జిల్లా జైలును బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ కేసుల వివరాలు, కుటుంబ వివరాలపై ఆరా తీశారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా అవసరమైన ఖైదీలకు న్యాయవాదులను ఏర్పాటు చేస్తామన్నారు. శిక్షను తగ్గించుకునేందుకు అప్పీల్‌కు వెళ్లే వారి వివరాలను సేకరించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఐదుగురు న్యాయవాదుల కమిటీ నియమించి ప్రతినెల రెండుసార్లు జైలును సందర్శించి వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఖైదీలకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా కమిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. న్యాయవాది అవసరం ఉండి నియమించుకోలేని స్థితిలో ఉన్న ఖైదీలు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థకు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వపరంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వెంకటేశం, జైలర్ నాయుడు, మల్లారెడ్డి, శివరాజు, యాదయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గోపాల్‌పేట: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఏదుల మండలం చెన్నారం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. రేవల్లి హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన అబ్దుల్ అలీం (35) ఇంట్లోనే చికెన్ విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. బుధవారం ఎప్పటిలాగే చికెన్ డ్రెస్సింగ్ మిషన్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడే పడిపోయాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే కారులో వనపర్తి ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అలీంకు భార్య ఫర్జానాబేగం, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. తండ్రి అబ్దుల్ రహీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.

మొక్కజొన్న @ రూ.2,265

జడ్చర్ల: బాదేపల్లి మార్కెట్‌లో మొక్కజొన్నకు క్వింటాల్ గరిష్టంగా రూ.2,265, కనిష్టంగా రూ.1,748 ధరలు లభించాయి. వేరుశనగ గరిష్టంగా రూ.6,589, కనిష్టంగా రూ.5,141, కందులు రూ.6,479, పెబ్బర్లు రూ.4,859, రాగులు రూ.2,359, జొన్నలుగరిష్టంగా రూ.4,077, కనిష్టంగా రూ.3,527, ధాన్యం హంస రూ.1,853, ఆర్ఎన్ఆర్ గరిష్టంగా రూ.2,255, కనిష్టంగా రూ.1,871 లభించాయి.

పబ్బతి అంజన్న.. పాహిమాం



మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయం, (ఇన్‌సెట్‌లో..) స్వామివారి మూల విగ్రహం

- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- నల్లమల కొండల్లో కొలువుదీరిన స్వామివారు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు

అచ్చంపేట/మన్ననూర్: చారిత్రాక ప్రాశస్త్యం కలిగి ప్రకృతి రమణీయ ప్రదేశంలో పబ్బతి ఆంజనేయస్వామి కొలువుదీరారు. కష్టాలను కడతేర్చే ఇష్టదైవంగా ఇక్కడి ప్రజలు ఆరాధిస్తారు. అమ్రాబాద్ మండలం నల్లమల అటవీ ప్రాంతంలోని మద్దిమడుగులో ఉన్న ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. గిరిజనులనేగాక నాగరీకులు, పర్యాటకులను సైతం విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ఆలయానికి జిల్లా నలుమూలల నుంచేగాక నల్గొండ, ప్రకాశం, గుంటూరు, కర్నూలు, హైదరాబాద్ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. నల్లమల కొండల్లో కృష్ణానది పశ్చిమ భాగాన దుంధుబి నది సంఘమించే రెండు నదుల కలయిక నడుమ శ్రీశైలం పుణ్య క్షేత్రానికి ఉత్తర దిశలో ఉంది. ఈ ఆలయాన్ని క్రీ.శ. 1120లో గుర్తించినట్లు.. పురాతన దేవాలయం కనుగొని ఓ చెట్టు కింద విగ్రహ ప్రతిష్ఠ చేసినట్లు చారిత్రక ఆధారాలున్నాయి.

ఏటా రెండు పర్యాయాలు..

మద్దిమడుగు అభయాంజనేయస్వామి ఉత్సవా లు ఏటా రెండు పర్యాయాలు పవిత్ర కార్తీక మాసం, చైత్రమాసంలో జరుగుతాయి. ఈ సందర్భంగా భక్తులు ఆంజనేయస్వామి మాలలు ధరిస్తారు. మాలధారుల సంఖ్య ప్రతి సంవత్సరం ఊహించని విధంగా పెరిగిపోయింది. ఉత్సవాల సందర్భంగా మాచర్ల, మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జునసాగర్, హైదరాబాద్, నల్గొండ, నాగర్‌కర్నూల్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. చైత్ర మాసం బ్రహ్మోత్సవాలు 10 నుంచి 12వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దేశావత్ రాములునాయక్, ఈఓ నర్సింహులు తెలిపారు.

కోట మైసమ్మ ఆలయం..

ఆంజనేయస్వామి ఆలయ ప్రదేశంలోనే కోట మైసమ్మ అమ్మవారు వెలిశారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. చాలామంది భక్తులు ఇక్కడ కోళ్లు, మేకలు సమర్పిస్తారు.

భక్తుల ప్రగాఢ విశ్వాసం..

స్వామివారిని దర్శించుకొని ఆలయం ఎదుట ఉన్న చెట్టుకు ఉయ్యాల కడితే సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అలాగే కోరిన కోర్కెలు తీరాలని ముడుపులు కట్టి.. తీరగానే ఆ ముడుపులను వారే స్వయంగా విప్పుతారు. ఆవు పాలు, నెయ్యి, బెల్లం, తేనె, గోధుమ రొట్టెలతో తయారు చేసిన పదార్థాలను నైవేద్యంగా సమర్పిస్తారు.

కార్యక్రమాలు ఇలా..

- 10న గురువారం అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణం, రాత్రి 8 గంటలకు అశ్వవాహన సేవ, శివపార్వతుల కల్యాణం
- 11న శుక్రవారం గవ్యాంతపూజ, ద్వాదశ వాస్తుపూజ, హోమం, రుద్రహోమం, మన్యసూక్తి హోమం, బలిహరణం, సహస్ర నామార్చన, రాత్రి 8 గంటలకు స్వామివారి వాహనసేవ, సీతారాముల కల్యాణం
- 12న శనివారం హనుమాన్ జయంతి రోజున ఉదయం 9 గంటలకు స్వామివారికి మహాకుంభాభిషేకం, శ్రీ హనుమాన్ గాయత్రి మహాయజ్ఞంలో పూర్ణాహుతి, హనుమాన్ దీక్షదారుల మాల విరమణ. మూడు రోజులు సమయానుకూలంగా సాంస్కృతిక కార్యక్రమాలు

మట్టి తరలింపు వేగవంతం



సమీక్షలో ప్రత్యేక అధికారి శివశంకర్, సహాయక బృందాల అధికారులు

- ఉబికి వస్తున్న నీటితో ఆటంకం
- 47 రోజులుగా కొనసాగుతున్న సహాయక చర్యలు

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ)సొరంగం లోపల చిక్కుకున్న కార్మికుల ఆచూకీ కనుకొనేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో రెస్క్యూ సిబ్బంది నిరంతరాయంగా పనులు చేపడుతున్నారు. సహాయక సిబ్బంది నిత్యం 20మీటర్ల వరకు మట్టి తవ్వకాలు చేపడుతూ శిథిలాలను బయటకు పంపిస్తున్నారు. ప్రభుత్వం విధించిన గడువులోగా సహాయక చర్యలు పూర్తి చేసేందుకు వేగం పెంచారు. అన్ని విభాగాల ఉన్నతాధికారులు సలహాలు,సూచనల మేరకు రెస్క్యూ బృందాలు ముందుకు సాగుతున్నారు. ఉబికి వస్తున్న నీటి ప్రవాహంతో సహాయక చర్యలకు ఆటంకాలు కలుగుతున్నాయని సహాయక సిబ్బంది చెబుతున్నారు. సొరంగం ప్రమాదానికి ప్రధాన కారణం నీటి ఊటేనని జీఎస్ఐ,సీఎస్ఐ,ఎన్‌జీఆర్ఐలు నిర్ధారించారు. వారి పర్యవేక్షణలో ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అత్యంత ప్రమాదకరమైన ప్రదేశం మినహా మిగిలిన ప్రదేశాల్లో తవ్వకాలు చేపడుతూ వెంటిలేషన్, కన్వేయర్ బెల్టు పొడిగింపు, టీబీఎం స్టీల్ భాగాల కత్తిరింపు వంటి పనులు నిరంతరాయంగా జరుగుతున్నాయి. ఫిబ్రవరి 22న సొరంగం పైకప్పు కూలిన ఘటనలో ఎనిమిది మంది కార్మికులు చిక్కుకోగా ఇద్దరి మృతదేహాలు వెలికి తీశారు. మిగిలిన ఆరుగురి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 12 రకాల సహాయక బృందాలకు చెందిన సిబ్బంది 47రోజులుగా గాలిస్తున్నా వారి ఆచూకీ నేటికీ లభ్యం కాలేదు.బుధవారం సొరంగం లోపల కన్వేయర్ బెల్టు పొడిగింపు పనులతో పాటు ఎస్కవేటర్ల సహాయంతో మట్టి, బురద,రాళ్లను కన్వేయర్ బెల్టు ద్వారా బయటకు తరలిస్తున్నారు. మట్టి తవ్వకాలు పూర్తి అయిన ప్రదేశం వరకు లోకో ట్రైన్ వెళ్లే విధంగా ట్రైన్ ట్రాక్ పొడగించే పనిలో నిమగ్నమయ్యారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మైన్స్ సీనియర్ శాస్త్రవేత్త జీసీ నవీన్, నీటిపారుదలశాఖ డీఈ శ్రీనివాసులు,కంపెనీ సీనియర్ ఇంజనీర్ సంజయ్ కుమార్‌సింగ్ ప్రమాద ప్రదేశంలో పరిస్థితులను క్షుణంగా పరిశీలించి సూచనలు, సలహాలు చేస్తున్నారు.

లోకో ట్రాక్ పునరుద్ధరణ

ప్రమాద ప్రదేశం సమీపం వరకు లోకో ట్రైన్ ట్రాక్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి అన్నారు. బుధవారం సొరంగం ఇన్‌లేట్ వద్ద జేపీ కార్యాలయంలో సహాయక చర్యల పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్షా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మట్టి తవ్వకాలకు అనుగుణంగా లోకో ట్రైన్ ట్రాక్ వెళ్లేవిధంగా మార్గం చేస్తున్నారని చెప్పారు. టీబీఎం స్టీల్ బాగాలు కత్తిరింపు పనులు,డీవాటరింగ్ ప్రక్రియ సమాంతరంగా కొనసాగుతుందన్నారు. కన్వేయర్ బెల్టు, వెంటిలేషన్ ప్రక్రియ ముందుకు కొనసాగిస్తున్నామని, సహాయక బృందాలు నిరంతరం శ్రమిస్తూ సహాయక చర్యలు ముమ్మరం చేశారన్నారు.ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్, విజయ్‌కుమార్, జేపీ కంపెనీ సీనియర్ ప్రాజెక్టు ఇంజనీర్ సంజయ్‌కుమార్ సింగ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య,ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి, దక్షిణ మధ్య రైల్వే అధికారి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమైన వస్తువులు

గండేడ్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగి పెళ్లి దుస్తులు, నగదు దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. గండేడ్ మండలం చిన్న వార్వాల్‌కు చెందిన బింగి బాలమ్మ చిన్న కూతురు పెళ్లి ఈ నెల 18న జరగాల్సి ఉంది. ఇందుకు గాను ఇటీవల పెళ్లి దుస్తులను కొనుగోలుచేసి ఇంట్లో పెట్టారు. బుధవారం అకస్మాత్తుగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఇంట్లో మంటలు చెలరేగాయి. ప్రమాదంలో పెళ్లి దుస్తులతో పాటు పెళ్లి ఖర్చుల కోసం తెచ్చిన రూ. లక్ష నగదు కాలిబూడిదయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి మంటలను ఆర్పివేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

జడ్చర్ల రూపు రేఖలు మారుస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: జడ్చర్ల పట్టణ రూపు రేఖలను మారుస్తామని, ఏడాదిలోగా మరో రూ.100 కోట్లను మంజూరు చేయించి అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.7.44 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షం నీళ్లు రోడ్లపై నిలవకుండా రూ.14 కోట్లతో స్టామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణానికి సంబంధించి త్వరలోనే టెండర్లు పూర్తి చేసి పనులు చేపడుతామన్నారు. రాజకీయాలకు అతీతంగా తాము నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఒక్కో వార్డు అభివృద్ధి కోసం లక్షలు చాలవని, కనీసంగా రూ.కోటి అవసరం అవుతాయన్నారు. పట్టణ అభివృద్ధికి అదనంగా మరో రూ.70 కోట్లు ఇవ్వాలని ఆర్థిక మంత్రిని కోరామని, త్వరలోనే ఆ నిధులు వస్తాయన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, వైస్ చైర్‌పర్సన్ సారిక, మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి, కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు చైతన్య చౌహాన్, సతీష్ ,ప్రశాంత్‌రెడ్డి, రాజు, మహేశ్, శ్రావణి పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటితో గొడవలు లేవు

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో తమకు ఎలాంటి గొడవలు లేవని, రెవెన్యూ శాఖతో మాత్రమే ఇబ్బంది ఉందని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. జడ్చర్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను ఎవరికీ భయపడనని, నిజం ఉంటేనే మాట్లాడుతానన్నారు. వంశీరాం బిల్డర్స్‌కు చెందిన 27 ఎకరా లభూమి ప్రభుత్వానిదేనని, దీనికి సంబంధిచి అసెంబ్లీలో మాట్లాడామన్నారు. రాజాపూర్ మండలంలో దాదాపు 700 ఎకరాల భూమి పట్టాదారులకు తెలియకుండా సాదాబైనామాల పేరుతో స్వాహా చేశారన్నారు. దీనిపై కలెక్టర్ విచారణ చేస్తున్నారని తెలిపారు.